నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శనివారం 15 మార్చి 2025 | YADADRI BHUVANAGIRI

## 40 డిగ్రీలు దాటిన ఎండ

### యాదాద్రి భువనగిరి జిల్లాలో ఉక్కిరిబిక్కిరి

భువనగిరి కలెక్టరేట్, మార్చి 14 : వేసవికి ముందే జిల్లాలో ఎండలు విపరీతమయ్యాయి. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. శుక్రవారం అత్యధికంగా సంస్థాన్‌నారాయణపురంలో 40.5 డిగ్రీలు, బొమ్మలరామారంలో 40.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఇదే అత్యధికం. గుండాలలో 40 డిగ్రీలు, రాజాపేట, ఆత్మకూరు(ఎం), మోటకొండూరు మండలాల్లో 39.9, చౌటుప్పల్‌లో 39.8, మోత్కూరు మండలంలోని దత్తప్పగూడెం, వలిగొండ మండలం వర్కట్‌పల్లి, ఆలేరు మండలం కొలనుపాకలో 39.5డిగ్రీలు, భువనగిరిలో 39.4, బీబీనగర్ వెంకిర్యాలలో 39.3, యాదగిరిగుట్టలో 39.1, రామన్నపేటలో 39, భూదాన్‌పోచంపల్లి మండలం జలాల్‌పూర్, అడ్డగూడూరులో 38.9, తుర్కపల్లి మండలంలో 38డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎండల తీవ్రత ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో పరిస్థితి ఏంటన్నది ఆందోళనకరంగా మారింది.


భువనగిరిలో హోలీ వేడుకలో ప్రజలు

## హోలీ సంబురం

### ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో వేడుక

రామగిరి, మార్చి 14 : రంగుల వేడుక హోలీ సంబురాలను ప్రజలు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. రంగులు చల్లుకొని చిన్నా పెద్ద ఎంజాయ్ చేశారు. డప్పుల దరువులు, హోరెత్తించే పాటల మధ్య చిందులు వేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు హోలీ వేడుకల్లో పాల్గొని జనాన్ని ఉత్సాహపరిచారు.

# జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌పై నిరసనల వెల్లువ

- పలుచోట్ల రాస్తారోకోలు
- ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాలు
- కుట్రపూరితంగా సస్పెన్షన్ వేటు : బీఆర్ఎస్ నేతలు.
- దళితుల పక్షపాతి జగదీశ్‌రెడ్డి : దళిత నేతలు

నల్లగొండ ప్రతినిధి, మార్చి14(నమస్తే తెలంగాణ) : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అకారణంగా అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడం పట్ల ఉమ్మడి జిల్లాలో వరుసగా రెండో రోజు నిరసనలు వెల్లువెత్తాయి. గురువారం సభలో సస్పెన్షన్ ప్రకటన వెలువడగానే తక్షణమే చాలా ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ కుట్రలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ రాస్తారోకోలు, నిరసన ప్రదర్శనలు, దిష్టిబొమ్మల దహనాలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన చేపట్టాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల పార్టీ నేతలు ఆందోళనలకు దిగారు. ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్‌ను నిరసిస్తూ మిర్యాలగూడలో పార్టీ శ్రేణులు రోడ్లపైకి వచ్చారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి సాగర్ రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ప్రభుత్వం తక్షణమే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలని ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. దేవరకొండ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. బస్టాండ్ ఎదుట ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం అక్కడే ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. మునుగోడులో అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ నేతలు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే జగదీశ్‌రెడ్డిపై పెట్టిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని, ప్రభుత్వ కుట్రపూరిత చర్యలు మానుకోవాలని నినాదాలు చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో పార్టీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తూ కోదాడ-మిర్యాలగూడ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ప్రభుత్వం కక్ష్యసాధింపు చర్యలు మానుకోవాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు. మఠంపల్లిలో పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. నిరసన ప్రదర్శనలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర నిర్వహించారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసి ఆగ్రహం వ్యక్తం చేశారు. గరిడేపల్లిలోనూ పార్టీ నేతలు, కార్యకర్తలు స్పందించి నిరసన చేపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను తగులబెట్టారు. నేరడుచర్లలోనూ పార్టీ నేతలు జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలంటూ ఆందోళన చేపట్టారు. పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పాలకవీడు మండల కేంద్రంలో పార్టీ నేతలు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఇక సూర్యాపేట బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో పార్టీకి చెందిన దళిత నేతలు నెమ్మాది భిక్షం, జీడి భిక్షం తదితరులు మీడియా సమావేశం నిర్వహించారు. దళితుల పట్ల జగదీశ్‌రెడ్డికి అపారమైన ప్రేమ ఉంటుందని, ఆయన దళిత పక్షపాతి అని స్పష్టం చేశారు. దళిత స్పీకర్‌ను అడ్డుపెట్టుకుని జగదీశ్‌రెడ్డిపై నీచ రాజకీయాలకు తెర లేపడం తగదన్నారు. తక్షణమే జగదీశ్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.


యాదగిరిగుట్టలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పార్టీ నాయకులు


మిర్యాలగూడలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు సమితి మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు


మునుగోడులో రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


నేరేడుచర్లలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



2021లో వెలిశాలలో ఎస్సారెస్పీ కాల్వ గట్టుపై సాగు చేసిన వరి పొలం

## ఎట్టాయె ఎవుసం..!

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎస్సారెస్పీ కాల్వలకు పుష్కలంగా సాగు నీరు రావడంతో రైతులు గుంట భూమి కూడా వదలకుండా వరి సాగు చేశారు. బీడు భూములు సైతం సాగులోకి వచ్చాయి. 2021లో తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామ పరిధిలోని ఎస్సారెస్పీ 69 డీబీఎం వద్ద కాల్వ గట్టుపై మట్టి తీసిన ప్రదేశంలో సైతం వరి సాగు చేశారు. ప్రస్తుతం కాల్వకు నీళ్లు రాక బోర్లు, బావులు సైతం వట్టిపోయాయి. దాంతో ఈ యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోయాయి. నాటి పరిస్థితిని తలచుకొని రైతులు మళ్లీ కేసీఆర్ పాలన వస్తేనే సాగు నీళ్లు వస్తాయని ఆశతో ఉన్నారు.

-తిరుమలగిరి, మార్చి 14



నీళ్లు లేక ఎండిన వరి పొలం

## 17నుంచి ఎంజీయూలో గణిత సదస్సు

- హాజరుకానున్న వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్స్.. విద్యార్థులు
- విద్యార్థుల్లో సబ్జెక్టు నైపుణ్యాలు పెంచేలా శిక్షణ

రామగిరి, మార్చి 14 : డిగ్రీలో గణితం చదివే విద్యార్థుల్లో సబ్జెక్టు నైపుణ్యాలు పెంచేలా రాష్ట్రంలోనే తొలిసారిగా మహాత్మా గాంధీ యూనివర్సిటీలో గణిత సదస్సు నిర్వహించనున్నారు. ఎంజీయూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ ఆధ్వర్యంలో నేషనల్ బోర్డు ఆఫ్ హయ్యర్ మ్యాథమెటిక్స్ (ఎన్‌బీహెచ్‌ఎం) సహకారంతో ఈ నెల 17 నుంచి 22 వరకు 'మ్యాథమెటిక్స్ ట్రైనింగ్ అండ్ టాలెంట్ సెర్చ్ (ఎంటీటీఎస్) ప్రోగ్రామ్ చేపట్టనున్నారు. రాష్ట్రంలో డిగ్రీ గణితం ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ నిర్వహిస్తుండగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ డిగ్రీ కళాశాలల నుంచి 40మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరికి శిక్షణ అందించేందుకు ఐఐటీ ప్రొఫెసర్స్, శివనాడు యూనివర్సిటీ న్యూఢిల్లీ ప్రొఫెసర్స్ రానున్నారు.

**శిక్షణ అంశాలు ఇవే..**

గణితంలో ఆల్‌జీబ్రా, రియల్ ఎనాలసిస్, మ్యాథమెటిక్స్ ఫౌండేషన్‌పై శిక్షణ అందిస్తారు. వీటితోపాటు గణితంలో పరిశోధనకు అవసరమైన అంశాలు, వాటి ప్రముఖ్యత, సులభంగా గణితం బోధించే అంశాలపై వివరించనున్నారు. శిక్షణ ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఆరు రోజులపాటు ఉంటుంది. దీనికి ఎంజీయూ గణిత విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.ఉపేందర్ రెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యహరించనుండగా సహాయ కోఆర్డినేటర్‌గా ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్, సీనియర్ గణిత అధ్యాపకుడు సముద్రాల ఉపేందర్ ఉండనున్నారు. అకాడమిక్ కో ఆర్డినేటర్‌గా డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమెటిక్స్ శివనాడు యూనివర్సిటీ, గౌతమ్ బుద్ధనగర్ ఉత్తరప్రదేశ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ.సత్యనారాయణ రెడ్డి పనిచేయనున్నారు.

## పాగిళ్లలో ఎలుగుబంటి

చందంపేట, మార్చి 14 : మండలంలోని పాగిళ్ల గ్రామంలో ఎలుగుబంటి సంచారం కలకలం రేపింది. గురువారం రాత్రి గ్రామంలోని వీధుల్లో తిరుగుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. గ్రామానికి సమీపంలోనే అటవీ ప్రాంతం ఉండడంతో ఎలుగుబంటి గ్రామంలోకి వచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటి గ్రామస్తులపై దాడి చేయకముందే బంధించాలని కోరుతున్నారు.


పాగిళ్ల గ్రామ వీధుల్లో సంచరిస్తున్న ఎలుగుబంటి

## గ్రూప్స్‌లో సత్తా చాటిన యువకులు

- సిరిపురం యువకుడికి గ్రూప్-3లో 9వ ర్యాంక్.. గ్రూప్-2లో 20వ ర్యాంక్
- గతంలో గ్రూప్-4 సాధించి జూనియర్ అసిస్టెంట్‌గా విధులు


సిల్వేరు సురేశ్


గుర్రం సాయికృష్ణారెడ్డి

రామన్నపేట, మార్చి14 : గ్రూప్- 3 పరీక్ష ఫలితాల్లో మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన సిల్వేరు సురేశ్ రాష్ట్ర స్థాయిలో 9వ ర్యాంక్ సాధించాడు. 450 మార్కులకు గానూ 323.184 మార్కులు పొందాడు. ఇతను గ్రూప్‌లో -2లో కూడా రాష్ట్ర స్థాయిలో 20వ ర్యాంక్ సాధించాడు. సిల్వేరు సత్తయ్య, మంగమ్మల చిన్నకుమారుడైన సురేశ్ గ్రామంలోని నేతాజీ హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదివాడు. పాలిటెక్నిక్ డిప్లొమా అనంతరం బీటెక్ పూర్తి చేశాడు. గతంలో గ్రూప్- 4లో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించి ప్రస్తుతం చౌటుప్పల్ ఆర్‌డీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. గ్రూప్స్‌లో రాష్ట్ర స్థాయి ర్యాంక్ సాధించడం పట్ల కుటుంబ సభ్యు లు, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

**గ్రూప్-3 లో మోత్కూరు వాసికి 29వ ర్యాంక్**

మోత్కూరు : గ్రూప్-3 ఫలితాల్లో మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన గుర్రం సాయికృష్ణారెడ్డి రాష్ట్ర స్థాయిలో 29వ ర్యాంకు సాధించాడు. ఆయన ఇప్పటికే గ్రూప్-2, గ్రూప్-4 పరీక్ష ఫలితాల్లో ప్రతిభను చాటాడు. గ్రూప్-1లోనూ 900 మార్కుల గాను 446 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఆయన ప్రస్తుతం యాదాద్రి కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు.

# సగం చెరువులు ఖాళీ

### జిల్లాలో ఎండిపోయే దశలో 412 చెరువులు

- భారీగా పడిపోయిన భూగర్భ జలాలు
- బోర్లు, బావులపై తీవ్ర ప్రభావం
- నీళ్లు లేక ఎండిపోతున్న పంటలు
- ప్రభుత్వ నిర్లక్ష్యం.. ఆందోళనలో రైతాంగం


పూర్తిగా ఎండిపోయిన సంస్థాన్‌నారాయణపురం మేళ్లచెరువు

యాదాద్రి భువనగిరి, మార్చి 14 (నమస్తే తెలంగాణ) : పాలకుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. కర్షకులకు పట్టించుకోవడమే మానేసి కాంగ్రెస్ సర్కారు నట్టేట ముంచుతున్నది. ఏడాది క్రితం నిండు కుండలా ఉన్న చెరువులు నేడు ఎడారిలా కనిపిస్తున్నాయి. జిల్లాలో దాదాపు సగం చెరువులు ఎండిపోవడంతో దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భ జలాలు వేగంగా ఇంకిపోవడంతో బోర్లు, బావులు వట్టిపోయి పంటలు ఎండిపోతున్నాయి.

**చెరువులపై నిర్లక్ష్యం..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చెరువులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యంగా మిషన్ కాకతీయ పథకంలో భాగంగా జిల్లాలో 733 చెరువుల్లో పూడిక తీశారు. మొదటి విడుతలో రూ.63 కోట్లతో 163 చెరువులు, రెండో విడుతలో రూ.76 కోట్లతో 203 చెరువులు, మూడో విడుతలో రూ. 70.78 కోట్లతో 240 చెరువులు, నాలుగో విడుతలో రూ. 25.90 కోట్లతో 127 చెరువులను పునరుద్ధరించారు. దాంతో మండుటెండల్లోనూ నిండు కుండల్లా కనిపించాయి. చెక్ డ్యామ్‌లు మత్తడి దుంకాయి. కానీ ఈసారి వేసవి రాకముందే చెరువులు ఖాళీ అవుతున్నాయి. ప్రభుత్వం పట్టింపులేమితో ఎక్కడికక్కడ ఎండిపోతున్నాయి. కొన్నిచోట్ల కాళేశ్వరం జలాలతో గొలుసుకట్టు చెరువులను నింపే ప్రయత్నం చేసినా ఆశించిన స్థాయిలో చేపట్టకపోవడంతో ఫలితం దక్కలేదు.

**ఎండిపోయే దశలో 412 చెరువులు**

జిల్లాలో చిన్నవి, పెద్దవి కలుపుకొని 1165 చెరువులు ఉన్నాయి. ఇందులో వంద ఎకరాలకు పైగా విస్తీర్ణంలో 159, వందలోపు ఎకరాల విస్తీర్ణం గలవి 1,006 ఉన్నాయి. వాటిల్లో దాదాపు సగం ఎండిపోయే దశకు చేరుకున్నాయి. నీటి పారుదల శాఖ లెక్కల ప్రకారమే.. 412 చెరువుల్లో అస్సలు లేకపోవడం నుంచి 25 శాతం నీళ్లు మాత్రమే ఉన్నాయి. 227 చెరువుల్లో 25 నుంచి 50శాతం లోపు, 191 చెరువుల్లో 50 నుంచి 75శాతం, 250 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీళ్లు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 85 చోట్ల సర్‌ప్లస్ ఉన్నట్లు పేర్కొంటున్నాయి. ఇప్పుడే చెరువులు ఎండుపోతుంటే నడి వేసవిలో పరిస్థితి ఏంటని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




**ఎడారిలా రామసముద్రం**

గుండాల : నీళ్లు లేక పూర్తిగా ఎండిన ఈ చెరువు గుండాల మండల కేంద్రంలోని రామసముద్రం. గతంలో నిండు కుండలా ఉన్న ఈ చెరువు ఇప్పుడు వెలవెలబోతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నవాబ్‌పేట రిజర్వాయర్ నుంచి దేవాదుల కాల్వల ద్వారా నాలుగు సార్లు రామసముద్రాన్ని నింపింది. దీని కింద వందెకరాలకుపైగా సాగయ్యేది. ఈ సీజన్‌లో చెరువు కింద వరి సాగు చేసిన రైతులు నీళ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బోర్లు, బావులు సైతం వట్టిపోతుండడంతో పంటలు ఎండిపోతున్నాయి.

**అడుగంటిన భూగర్భ జలాలు.. వట్టిపోతున్న బోర్లు**

చెరువుల్లో నీళ్లు తగ్గిపోతున్నట్టే భూగర్భ జలాలు వేగంగా పడిపోతున్నాయి. ఫిబ్రవరిలో సగటున 10.95 మీటర్ల లోతుకు వెళ్లాయి. గతంలో సగటున నాలుగైదు మీటర్ల లోతులోనే నీళ్లు ఉండగా, గతేడాది కంటే ఈసారి 2.36 మీటర్ల మేర అధికంగా పడిపోయాయి. జిల్లాలోని 17 మండలాల్లో భూగర్భ జలమట్టం తగ్గింది. సంస్థాన్ నారాయణపురంలో అత్యధికంగా 23.09 మీటర్ల దూరం లో నీళ్లు ఉన్నాయి. ఫలితంగా బోర్లు, బోరు బావులు వట్టిపోయి పంటలు ఎడిపోతున్నాయి.

**ఎండుతున్న పంటలు.**

జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో 3.19లక్షల ఎకరాల్లో సాగు అవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేయగా, రైతులు 2.80 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఇందులో అధిక శాతం వరి సాగు చేశారు. ఓ వైపు నీళ్లు లేక.. మరోవైపు ఎండల ప్రభావంతో కండ్ల ముందే పంటలు ఎండిపోతున్నాయి. పొట్ట దశలో వరి కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొందరు ట్యాంకర్ల ద్వారా నీళ్లు కొని తడులు అందిస్తున్నారు. ఇప్పటికే ఎండిన పంటలు పశువులకు మేతగా వినియోగిస్తున్నారు.

**నెర్రెలు బారిన మేళ్లచెరువు**

సంస్థాన్ నారాయణపురం : ఇది సంస్థాన్ నారాయణపురం గుట్టల్లో ఉన్న మేళ్లచెరువు. సామర్థ్యం ఒక టీఎంసీ. మేళ్లచెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. 30 కిలోమీటర్ల పరిధి వరకు బోర్లు పుష్కలంగా పోస్తాయి. అలాంటి చెరువు ఇప్పుడు నెర్రెలు వారి కనిపిస్తున్నది. 700 నుంచి వెయ్యి ఫీట్ల వరకు బోర్లు వేస్తున్న చుక్క నీరు పడడం లేదని సమీప రైతన్నలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం శివన్నగూడెం ప్రాజెక్టు పూర్తి చేసి అక్కడి నుంచి రాచకొండలో లిఫ్ట్ ఏర్పాటు చేసి మేళ్లచెరువుతోపాటు స్థానిక చెరువులను నింపితే నారాయణపురం మండలం తాగు, సాగునీటికి ఇబ్బంది ఉండదని స్థానికులు చెప్తున్నారు.



**చెరువు నింపుతామంటే పంట వేశా..**

మా ఊరి కొత్తచెరువును నింపుతామని ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య హామీ ఇస్తే బంగారం కుదువబెట్టి నాకున్న మూడెకరాల్లో వరి నాటు పెట్టిన. చెరువు నిండితే నీళ్లకు ఢోకా ఉండకపోయేది. కానీ, నీళ్లు ఇవ్వకపోవడంతో పంట మొత్తం ఎండిపోయింది. ఎండిన పొలంలో ఆవులను మేపుతున్నా. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులను ఆదుకోవాలన్న ఆలోచన ఉన్నట్టే కనిపించడం లేదు.

-వాటికి యాదగిరి, రైతు, మాసాయిపేట (యాదగిరిగుట్ట మండలం)